సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



66.48 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 66.48 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువ నుంచి 19,923 క్యూసెక్కుల వరద వస్తుండగా, కండలేరుకు 10 వేలు, దిగువకు 355 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.81,280
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,378
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,599
నవర (8 గ్రాములు)	రూ.60,792

గరిష్టం/కనిష్టం

35.1 /27.4

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి సమయంలో ఆకాశం మేఘావృతంగా ఉండే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 79 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఉచిత గ్యాస్ పంపిణీకి చర్యలు

- డీఎస్‌ఓ వెంకటరమణ



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటరమణ

నెల్లూరు (పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓ వెంకటరమణ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం సివిల్ సప్లయీస్ కార్యాలయంలో అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో డీఎస్‌ఓ మాట్లాడారు. నవంబరు నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్ సిలిండర్లు ప్రారంభమవుతుందన్నారు. దీనికి ఏజెన్సీలు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న వారు గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. డెలివరీ ఇచ్చిన 48 గంటల్లో వినియోగదారుల బ్యాంక్ అకౌంట్‌కు నగదును జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్‌ఓ అంకయ్య, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడో యూనిట్లో విద్యుదుత్పత్తి నిలిపివేత

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మంగళవారం సాంకేతిక కారణాలతో 3వ యూనిట్లో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. ప్రస్తుతం 1వ యూనిట్లో 430, 2వ యూనిట్లో 440 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు ప్రాజెక్ట్ ఇంజినీర్లు తెలిపారు.

ఆత్మకూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శీనానాయక్



శీనానాయక్

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఆత్మకూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శీనానాయక్ నియమితులయ్యారు. గతంలో నెల్లూరు నుడా చైర్మన్‌గా ఉన్న టీ బాపిరెడ్డిని శ్రీకాళహస్తి ఆలయ ఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కె.వెంకటరెడ్డి, రాపూరు ఎస్‌డీసీగా ఎం.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు.


మార్ట్‌గేజ్ భవనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో మార్ట్‌గేజ్ విడుదలకు అర్జీలు అందిన భవనాలను కమిషనర్ సూర్యతేజ మంగళవారం తనిఖీ చేశారు. నగరంలోని జగదీష్‌నగర్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు, పొదలకూరురోడ్డు, పోలీసు కాలని తదితర ప్రాంతాల్లో తనిఖీ చేసి, ఆయా భవనాలకు సంబంధించిన అన్ని దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో యోగా గురుకు ద్వితీయ స్థానం



బహుమతి అందుకుంటున్న రాజేంద్రకుమార్

కొడవలూరు: ఈ నెల 26, 27 తేదీల్లో నంద్యాలలో జరిగిన ఏపీ స్టేట్ 37వ యోగాసన చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా గురు జ్యోతి రాజేంద్రకుమార్ ప్రతిభ కనబరచి ద్వితీయ బహుమతి సాధించారు. ఏపీ యోగా అసోసియేషన్ చైర్మన్, ప్రెసిడెంట్ కె.హరినాధరెడ్డి, కె.కృష్ణదేవరాయులు చేతుల మీదుగా రాజేంద్రకుమార్ బహుమతి అందుకున్నారు. రాజేంద్రకుమార్‌ను గండవరం ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి గీత, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జి.శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు.

పటాస్‌ల్లోనూ వాటాలు



దీపావళి పండగనూ పచ్చ నేతలు వదల్లేదు. పటాస్‌ల్లోనూ వాటాల వసూళ్ల మోత మోగించారు. బాణసంచా లైసెన్స్‌దారుల నుంచి భారీ మొత్తంలో దుండుకున్నారు. భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి, నిబంధనలకు తూట్లు పొడిచి విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ అనధికారికంగా దుకాణాల ఏర్పాటుకు టీడీపీ నేతలే అనుమతులు ఇచ్చేశారు. లైసెన్స్ దుకాణాల నుంచి అనధికార దుకాణాల నిర్వహణకు రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, పోలీస్ శాఖల అధికారాలను సైతం హైజాక్ చేశారు. ఈ పరిణామాలతో బాణసంచా ధరలు తారాజువ్వల్లా ఆకాశానికి ఎగబాకాయి.



నిబంధనలకు విరుద్ధంగా చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన దుకాణం

దుకాణాల కేటాయింపుల్లో పచ్చ ముద్ర

- ఒక్కొక్క షాపునకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు దండకాలు
- అనధికారికంగా జనావాసాల మధ్య వందల సంఖ్యలో దుకాణాలు
- తమ్ముళ్లు, అధికారుల దోపిడీతో 20 శాతం ధరలు పెంచేసిన వ్యాపారులు
- నిబంధనలకు తూట్లు పొడిచిన అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, పోలీస్‌లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో టీడీపీ నేతలు రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ శాఖల అధికారాలను తోసిపుచ్చుతూ, నిబంధనలను కాలరాస్తూ ఇప్పటి వరకు సహజ సంపదలను దోచుకున్నారు. తాజాగా దీపావళి పండగను దోపిడీకి అనుకూలంగా మలుచుకున్నారు. చిన్నా, పెద్ద సంబురంగా జరుపుకునే పటాస్‌ల పండగను తుస్సుమనేలా చేశారు. సాధారణంగా బాణసంచా విక్రయాలకు, నిల్వలకు కొందరికే లైసెన్స్‌లు, అనుమతులు ఉంటాయి. ఇదే అదనుగా ప్రతి లైసెన్స్‌దారుడికి టార్గెట్ పెట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. ఈ దుకాణాల్లో కొన్ని తమ వాళ్లకే అప్పగించేలా బెదిరింపులకు దిగారు. కొన్ని చోట్ల అనుమతుల్లేకపోయినా.. అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారు.

నిబంధనలకు తూట్లు

నిప్పు రవ్వ పడితే భారీ పేలుళ్లకు అస్కారం ఉండే బాణసంచా దుకాణాలను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఈ ఏడాది నిబంధనలు ఏ మాత్రం పట్టకుండా ఇష్టారాజ్యంగా రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేశారు. పాఠశాలలు, ఇళ్లు, అపార్ట్‌మెంట్ మధ్యలో ఏర్పాటు చేశారు. గత ఐదేళ్లగా ఎప్పుడూ లేని విధంగా వందలాది కొత్త దుకాణాలు పుట్టుకొచ్చాయి. ఈ పరిణామాలు ప్రజల భద్రతకు పెనుముప్పు కానుంది. గతంలో దుకాణాలు రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ శాఖల అనుమతి మేరకు ఎక్కడికక్కడే ఏర్పాటు చేసుకునేవాళ్లు. దీని వల్ల అగ్నిప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం ఉంటుందని భావించిన గత ప్రభుత్వం నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ బాణసంచా దుకాణాలను ఒకే చోట ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత నిబంధనలకు తూట్లు పొడిస్తూ.. ఎక్కడిపడితే అక్కడ అనధికార దుకాణాల ఏర్పాటుతో కొత్త సంప్రదాయానికి పచ్చనేతలు తెరతీశారు.

సామర్థ్యానికి మించి భారీ స్థాయిలో నిల్వలు

జిల్లాలో అధికారికంగా అనుమతులు కలిగి



అనుమతుల్లేని బాణసంచా దుకాణాలు



బాణసంచా తయారీ చేసే కేంద్రాలు 14 ఉండగా, విక్రయించే గోదాములు 20 వరకు ఉన్నాయి. అనధికారికంగా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. జిల్లా కేంద్రంలో అయితే 5 వేల కిలోల వరకు నిల్వ ఉన్న గోదాములు ఉండగా, మిగిలిన ప్రాంతాల్లో 1500 కిలోల నిల్వకు అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ నిబంధనలు అతిక్రమిస్తూ వేల కిలోల సరుకును గోదాముల్లో వ్యాపారులు నిల్వ ఉంచి విక్రయాలు సాగిస్తున్నారు. ఇక గోదాములు, దుకాణాల వద్ద నిబంధనల మేరకు జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ పలుచోట్ల అవి కేవలం అలంకార ప్రాయంగానే మిగిలిపోయినట్లు తెలుస్తోంది. ఏదైనా అనుకోని ఘటన జరిగితే భారీ మూల్యం చెల్లించక తప్పని పరిస్థితి నెలకొంది. అగ్నిమాపక శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలు పక్కగా అమలయ్యేలా చూడాల్సి ఉండగా నామమాత్రపు తనిఖీలకే పరిమితమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ధరల మోత మోగుతున్నాయి..

అధికారిక, అనధికారిక బాణసంచా దుకాణాలకు టీడీపీ నేతలతో పాటు అగ్నిమాపకశాఖ అధికారులు గోదాములకు, తయారీ కేంద్రాలు, వ్యాపారులకు ఒక్కో రేటు నిర్ణయించి నగదు వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్‌ఓసీల జారీ విషయంలో దుకాణదారుల నుంచి పెద్ద మొత్తంలో దండుకుంటే.. కూటమి నేతలు బహిరంగ ప్రదేశాల్లో వ్యాపారాలు సాగించే దుకాణదారుల నుంచి ప్రాంతాన్ని ఒట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఎన్ని దుకాణాలు, ఎన్ని గోదాములు, తాత్కాలికంగా ఎన్ని దుకాణాలకు లైసన్సులు మంజూరు చేశారనే కనీస సమాచారాన్ని అధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, వ్యాపారుల నుంచి భారీగా ముడుపులు స్వీకరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితితో బాణసంచా ధరలు మోత మోగుతున్నాయి. 2000 వాలా ఒక ప్యాకెట్ రూ.1500, 5000 వాలా 3 వేలు, 10,000 వాలా రూ.5 వేలుకు పైగానే విక్రయిస్తున్నారు. గిఫ్ట్ బాక్స్‌లు రూ.700 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు.

బిల్లు ఉండదు... ట్యాక్స్ కట్టరు

బాణసంచా వ్యాపారులు అందరికి పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించడంతో లాభాలు రాబట్టుకునేందుకు అధిక ధరలకు బాణసంచా విక్రయించేందుకు సిద్ధమయ్యారు. వినియోగదారులు కొనే వస్తువులకు దుకాణదారుడు రసీదు ఇవ్వాల్సి ఉంది. కానీ టపాసుల విక్రయాల్లో మాత్రం అంతా జీరో బిజినెస్ నడుస్తోంది. టపాసులకు సంబంధించి వ్యాపారులు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతోంది. విక్రయాలు సాగించిన మొత్తానికి 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు మాత్రం ఎలాంటి ట్యాక్సులు చెల్లించకుండానే వ్యాపారం సాగిస్తున్నారు.

అనధికార దుకాణాలే అధికం

జిల్లాలో ఈ ఏడాది దాదాపు 350కు పైగా అధికారికంగా దుకాణాలు కేటాయిస్తే.. అనధికారికంగా రెట్టింపు స్థాయిలో ఏర్పాటు చేసినట్లు అగ్నిమాపశాఖాధికారులే చెబుతున్నారు. ఒక్క నెల్లూరు నగరంలో ఆర్‌ఎస్‌ఆర్ గ్రౌండ్స్‌లో 28, వీఆర్సీ గ్రౌండ్స్‌లో 46, మైఎంసీ గ్రౌండ్స్‌లో 19, ఎస్‌వీజీఎస్ కళాశాల గ్రౌండ్స్‌లో 20, సర్వోదయ గ్రౌండ్స్‌లో 10 మొత్తం 123 దుకాణాలకు సంబంధించి సోమవారం సాయంత్రం లాటరీ విధానంలో లైసెన్స్‌దారులకు కేటాయించారు. అయితే అధికారుల అనుమతులు లేకుండా నగరంలోని మైపాడుగేటు, నవాబుపేట, మినీ బైపాస్‌రోడ్డు, చిల్డ్రన్స్‌పార్క్, పొదలకూరురోడ్డు, వేదాయపాళెం తదితర ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా బాణసంచా దుకాణాలు ఇళ్ల మధ్య టీడీపీ నేతల అండదండలతో ఏర్పాటు చేశారు. ఒక్కొక్క దుకాణానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష చెల్లిస్తే ఎక్కడైనా దుకాణం ఏర్పాటు చేసుకునే అవకాశం ఇస్తున్నారు. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.



చిన్నారిని తల్లి ఒడికి చేర్చిన సీసీ కెమెరా

తల్లి స్నేహితురాలే నిందితురాలు

- కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐపై వీఆర్ వేటు
- కొత్త సీఐ గిరిబాబు నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరం
- 30 గంటల ఉత్కంఠ తర్వాత వీడిన మిస్టరీ



తల్లిదండ్రుల ఆనందోత్సాహం

కావలి: ఊయల్లో నుంచి అపహరణకు గురైన 15 నెలల చిన్నారి ఎట్టకేలకు 30 గంటల ఉత్కంఠ తర్వాత తల్లి ఒడికి చేరింది. పట్టణంలోని వెంగళరావునగర్‌లో సోమవారం మధ్యాహ్నం అపహరణకు గురైన విషయం తెలిసిందే. ఓ మహిళ ఆ చిన్నారిని అపహరించి తీసుకెళ్తున్న దృశ్యాలు ఒక చోట ఉన్న సీసీ కెమెరాలో రికార్డు కావడంతో పోలీసులు మంగళవారం సాయంత్రానికి ఛేదించగలిగారు. దీంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు. పట్టణ ప్రజలు కూడా ఊపిరి పీల్చుకున్నారు.

కావలిలోనే ఎస్పీ తిష్ట వేసి..

చిన్నారి తేజ అపహరణకు గురికావడంతో ఎస్పీ కృష్ణకాంత్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. మంగళవారం వరకు ఈ కేసులో పురోగతిలో లేకపోవడంతో మధ్యాహ్నం ఆగమేఘాల మీద కావలికి చేరుకున్న ఆయన చిన్నారి అపహరణ జరిగిన ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. చిన్నారి తల్లి పల్లపు రాజేశ్వరిని విచారించారు. తొలుత ఘటన జరిగిన టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని చిన్నారి అపహరణ తర్వాత దర్యాప్తుపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. అనంతరం పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనంలోనే ఉండి దర్యాప్తును చేపట్టారు. పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే ఘటన జరిగిన ఇంటికి సమీపంలో ఓ ఇంటి యజమాని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించిన టుటౌన్ సీఐ కె.శ్రీనివాసరావు వీడియో పుటేజీని పరిశీలించారు. అందులో ఒక మహిళ చిన్నారిని అపహరించిన ఇంటి వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. సదరు మహిళ దిక్కులు చూస్తూ పరిసరాలను గమనిస్తూ తన చీర చెంగును ముఖానికి కప్పుకుని వెళ్లింది. కొద్ది సేపట్లోనే ఆ మహిళ 15 నెలల చిన్నారిని ఎత్తుకుని అదే రోడ్డులో దర్జాగా వెళ్తున్న దృశ్యం, తన భుజంపై పడుకోబెట్టుకుని ముఖం కనిపించకుండా చేసిన దృశ్యాలు వీడియో పుటేజ్‌ల్లో నిక్షిప్తం అయ్యా యి. ఈ పుటేజీ ఆధారంగా కావలి పోలీసులతో పాటు నెల్లూరు సీసీఎస్ సిబ్బంది కూడా కావలికి చేరుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. అయితే ఈ ఘటన తర్వాత దర్యాప్తులో నిర్లక్ష్యం వహించిన టు టౌన్ సీఐ కె.శ్రీనివాసరావును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆ స్థానంలో గిరిబాబును నియమించి దర్యాప్తును కొనసాగించారు.

తల్లి స్నేహితురాలే నిందితురాలు

చిన్నారి తేజను తల్లి పల్లపు రాజేశ్వరికి స్నేహితురాలైన స్వరూప అపహరించినట్లు గుర్తించిన పోలీసులు ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో ఆమె సెల్‌ఫోన్ కాల్ డేటా, టవర్ లొకేషన్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. స్వరూప చెల్లెలు గీత కూడా కావలిలోనే ఉంటుంది. తొలుత పోలీసులు గీతను విచారించగా, తన అక్క ఇంట్లో చిన్నారిని అపహరించినప్పుడు ధరించిన చీర ఉన్నట్లుగా చెప్పింది. ఎక్కడికి వెళ్లి ఉంటుందో తెలియజేసింది. స్వరూపకు ఫోన్ చేస్తుంటే సమాధానం చెప్పకుండా దాటవేస్తోంది. దీంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం పొన్నలూరులో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అక్కడి పోలీసులను అలెర్ట్ చేయ డంతో స్వరూపను, చిన్నారిని అదుపులోకి తీసుకున్నారు.

చిన్నారిని పెంచుకోవాలని..

కావలిలోనే నివాసం ఉంటున్న స్వరూప, చిన్నారి తల్లి స్నేహితులు. చిన్నారి ఇంటికి స్వరూప తరచూ వస్తుండేది. ఈ క్రమంలో పిల్లలు లేని స్వరూప చిన్నారి తేజను తీసుకెళ్లి పెంచుకోవాలని భావించింది. సోమవారం స్వరూప తన స్నేహితురాలు ఇంటికి వెళ్లింది. చిన్నారి ఊయల్లో ఉండడం, స్నేహితురాలు కనిపించక పోవడంతో తన ప్లాన్‌ను అమలు చేసినట్లు తెలుస్తోంది. చిన్నారిని అపహరించి, అప్పటి వరకు తాను కట్టుకున్న చీరను విచిడి వేరే డ్రెస్ ధరించి జిల్లా సరిహద్దులు దాటి వెళ్లిపోయింది.



చిన్నారిని ఎత్తుకెళ్తున్న మహిళ.. సీసీ కెమెరా ఫుటేజీ



కనిగిరి నుంచి కారులో వస్తున్న మహిళను నాగిరెడ్డిపాలెం దగ్గర పట్టుకున్న ఎస్సై అనుక్

నాకాబందీతో పట్టుబడిన మహిళ

చిన్నారి తేజను అపహరించిన సదరు మహిళ కారు అద్దెకు తీసుకుని వింజమూరు మీదుగా మార్కాపురం చేరుకుంది. మంగళవారం ఉదయం నుంచి కారులోనే తిరుగుతూ సాయంత్రం సమయంలో కనిగిరి ప్రాంతానికి చేరుకుంది. అయితే తేజ అపహరణకు గురైన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పొన్నలూరు ఎస్సై కె.అనుక్ తన సిబ్బందితో సాయంత్రం నాగిరెడ్డిపాళెం అడ్డరోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారులో చిన్నారితో ఉన్న మహిళను గుర్తించి విచారించగా ఆమె మాటలు, ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కావలి పోలీసులు పొన్నలూరుకు వెళ్లి చిన్నారిని, అపహరణకు పాల్పడిన స్వరూపను కావలికి మంగళవారం రాత్రి తీసుకు వచ్చారు. చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారిని అపహరించడానికి నేపథ్యంపై మహిళ స్వరూపను పోలీసులు విచారిస్తున్నారు.



బాలుడు, మహిళను కావలి పోలీసులకు అప్పగిస్తున్న ఎస్సై అనుక్

సీసీ కెమెరా వ్యవస్థను పటిష్టం చేస్తాం: ఎమ్మెల్యే దగుమాటి

కావలి పట్టణంలో సీసీ కెమెరా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెడతామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చెప్పారు. అపహరణకు గురైన చిన్నారి తల్లిని ఆమె నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరా వల్లనే చిన్నారి అపహరణను పోలీసులు ఛేదించగలిగారని చెప్పారు. కావలిలో ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపారస్తులు తదితరుల సహకారంతో సీసీ కెమెరాల వ్యవస్థను సంపూర్ణంగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

వందశాతం అక్షరాస్యత సాధించాలి

- కలెక్టర్ ఓ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (పొగతోట): జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధన దిశగా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై ఎంపీడీఓలు, ఏపీఎంల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 18 ఏళ్ల దాటిన సుమారు 20 వేల మంది నిరక్షరాస్యులు ఉన్నారని, వారిని ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యులను చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓలు, ఏపీఎంలు, వయోజన విద్య ఏపీఓలు పూర్తి సహకారం అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన స్వయం సహాయక మహిళలు, అంగన్‌వాడీ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు, ఇతర పనులు చేసే కార్మికులను గుర్తించి ఉల్లాస్ కార్యక్రమంలో వారిని భాగస్వాములు చేసి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో ఉల్లాస్ కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం మాత్రమే కాకుండా 21వ శతాబ్దపు పౌరుడికి అవసరమైన క్రిటికల్ లైఫ్ స్కిల్స్ వంటి తదితర విభాగాలను అందించడమే ఈ ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందు కోసం ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని 2 మండలాల్లో యాప్‌ను ప్రయోగాత్మకంగా పరిశీలించామన్నారు. జిల్లా వ్యాప్తంగా సంపూర్ణ అక్షరాస్యత సాధించడంలో ఎంపీడీఓల పాత్ర గణనీయంగా ఉంటుందని తెలిపారు. డీఆర్‌డీఏ సిబ్బందిని భాగస్వామ్యం చేశామన్నారు. వచ్చే నెలలో రెండు వారాల పాటు నిరక్షరాస్యుల గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే నిర్వహించాలని సూచించారు. వయోజన విద్య ఉప సంచాలకులు మహ్మద్ ఆజాద్ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన స్వయం సహాయక సంఘ సభ్యులను, ప్రభుత్వ బడులలో పనిచేస్తున్న ఆయాలను, ఇతరులను అక్షరాస్యులను చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వయోజన విద్య కేంద్రంగా పని చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, ఎంపీడీఓలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు పెద్దాస్పత్రిలో అధునాతన వైద్యం



ర్యాలీలో మాట్లాడుతున్న పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, న్యూరాలజిస్ట్ డాక్టర్ ఫణికుమార్ తదితరులు

- ప్రభుత్వ డాక్టర్లు, నర్సుల అవగాహన ర్యాలీ

నెల్లూరు (అర్బన్): బ్రెయిన్ స్ట్రోక్‌కు ప్రభుత్వ పెద్దాస్పత్రిలో అధునాతన వైద్య సేవలందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, మెడికల్ కళాశాల, ప్రసూతి ఆస్పత్రి నుంచి మెయిన్ రోడ్డులో అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవన విధానం, జంక్‌ఫుడ్ తీసుకోవడం, బీపీ, షుగర్ అదుపులో లేకపోవడం, ఆల్కాహాల్ తీసుకోవడం, ధూమపానం, శీతలపానీయాలు సేవించడంతో బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందన్నారు. అవగాహన పెంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా స్ట్రోక్‌తో వచ్చే పక్షవాతం తద్వారా కలిగే వికలత్వాన్ని అరికట్టవచ్చన్నారు. స్ట్రోక్‌తో మెదడులో ఒక్కో దఫా రక్తం కారుతుందన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. స్ట్రోక్‌కు గురైన వారిని మొదటి నాలుగున్నర గంటల్లో ఆస్పత్రికి తీసుకెళ్లితే వైద్యం ద్వారా బతికించవచ్చన్నారు. పెద్దాస్పత్రిలో స్ట్రోక్ గురైన గోల్డెన్ అవర్‌లో వేసే రూ.40 వేల విలువైన ఇంజక్షన్లు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, జనరల్ ఫిజిషియన్ విభాగం డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణనకు శ్రీకారం


పశుగణనలో భాగంగా వివరాలు తెలుసుకుంటున్న పశుసంవర్థక శాఖ అధికారి

- ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి లెక్కింపు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ నిర్వహించనున్న అధికారులు
- ప్రస్తుతం 37 లక్షల మూగజీవాలున్నట్లు గుర్తింపు

నెల్లూరు(సెంట్రల్): పశువుల లెక్క ఇకపై పక్కాగా ఉండనుంది. పశుసంవర్థక శాఖ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని చేపట్టింది. దేశ వ్యాప్తంగా ప్రతీ ఇంట్లో ఎన్ని పశువులు ఉన్నాయో లెక్కించేందుకు అధికార యంత్రాంగం నడుం బిగించింది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ ప్రక్రియ గతంలో 2018లో ప్రారంభమై 2019లో ముగిసింది. మళ్లీ ఈ ఏడాది పశుగణన మొదలైంది.

జిల్లాలో మొదలైంది

21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ఈనెల 25వ తేదీ నుంచి జిల్లాలో మొదలైంది. దీనిని 2025 ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేసేలా పశుసంవర్థక శాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. జీవాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా పశుసంపద ద్వారా ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు, మాంసం తదితర స్థూల ఉత్పత్తిని లెక్కించడంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. పశుగణన ద్వారా పాడి రైతులకు సంబంధించి అవసరమైన పథకాలపై ప్రణాళికను రూపొందించుకోవచ్చు.

ప్రస్తుత లెక్కల ప్రకారం

జిల్లాలో ప్రస్తుతం అనేక రకాల మూగజీవాలున్నాయి. ఆవులు, గేదెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్లు, ఇతర పక్షులను లెక్కిస్తారు. కాగా ఆవులు 57 వేలు, గేదెలు తదితరాలు 6.57 లక్షలు, గొర్రెలు 10.20 లక్షలు, మేకలు 3.6 లక్షలు, కుక్కలు 30 వేలు, వివిధ రకాలకు చెందిన మరికొన్ని కలిపి 21.24 లక్షలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంకా కోళ్లు, బాతులు, ఇతర పక్షులు 15.88 లక్షలు ఉన్నట్లు గుర్తించారు.

416 మంది

పశుగణనకు సంబంధించి ప్రతి గ్రామంలో ఎక్కడా పొరపాటు లేకుండా లెక్కించేందుకు పశువైద్యాధికారులు 70 మంది సూపర్‌వైజర్లను నియమించారు. వీరి ద్వారా 346 మంది పశుసంవర్థక శాఖ పారా సిబ్బందిని ఎంపిక చేశారు. గ్రామాల్లో ప్రతి రెండు వేల కుటుంబాలకు ఒక ఎన్యుమరేటరు, పట్టణ ప్రాంతాల్లో మూడు వేల కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను ఏర్పాటు చేశారు. పశుగణన కోసం ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. యజమాని వివరాలతోపాటు భూమి, పశువుల వివరాలు, చూడి, పాడి పశువులు, జెర్సీ, ఇతర ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు తదితర మూగజీవాల వివరాలను సేకరిస్తారు. ఆ వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తారు. సంకర జాతి, దేశీయ జాతి పశుసంపదను వేర్వేరుగా లెక్కిస్తారు. ప్రతి అంశానికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు.

ఈ లెక్కలు ఎందుకంటే..

16 రకాల మూగజీవాలను పశుగణనలో ప్రధానంగా తీసుకుంటారు. వీటి ద్వారా పాడిరైతులతోపాటు, జిల్లాలో ఏ విధంగా పాడిపరిశ్రమ ఉంది? దీని వల్ల జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు పాడి ఉత్పత్తులు ఎంత మేర వెళ్తున్నాయి?, ఎంతమంది పాడి రైతులు జీవనం సాగిస్తున్నారు. అదే విధంగా కోళ్లు, బాతులు ఇతర వాటి వల్ల ఎటువంటి ఉపయోగం జరుగుతోంది?, కోడిగుడ్లు ఎంత మేర ఉత్పత్తి అవుతున్నాయి?, కోళ్లకు ఎటువంటి టీకాలు వేయాలి?, ఇతర అనారోగ్య కారణాలు వస్తే ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి?, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? తదితర వివరాలు నమోదు తెలుసుకునేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని అధికారులు చెప్పుకొస్తున్నారు.

మూగజీవాల వివరాల కోసం..



మూగజీవాల లెక్కింపు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. గతంలో ఎంత మేర ఉన్నాయి?, ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి?, వీటితోపాటు గతంలో కంటే పాడి పరిశ్రమ ఎక్కువగానే ఉందా.. తగ్గిందా? అనే వివరాలతోపాటు, కోళ్ల ఉత్పత్తి ఎలా ఉంది? అనే వివరాలు తెలుసుకుంటాం. ఈ నమోదు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– డాక్టర్ మంజునాథ్, జిల్లా నోడల్ అధికారి, పశుసంవర్థక శాఖ

కసుమూరులో బెల్టు దుకాణం


బెల్టు దుకాణంలోని మద్యం బాటిళ్లు


ఉదయం సమయంలో మద్యం తీసుకెళ్తూ..

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

వెంకటాచలం: అధికార పార్టీ అండ చూసుకుని కొందరు రెచ్చిపోతున్నారు. వేలాది మంది భక్తులు వచ్చే ప్రాంతాల్లో బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. వెంకటాచలం మండలంలోని కసుమూరు గ్రామంలో ఉన్న మస్తాన్‌వలీ దర్గా దక్షిణ భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. కూటమి ప్రభుత్వంలో కసుమూరులో మద్యం ఏరులై పారుతోంది. ఇక్కడ మద్యం షాపు ఉంది. ఇది ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటోంది. దీనికి సమీపంలోనే ఒకటి, ఊర్లోనే మరొక బెల్టు దుకాణాలను పెట్టారు. సమయంతో పని లేకుండా ఇక్కడ మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. భక్తుల మనోభావాలను పట్టించుకోకుండా కసుమూరులో బెల్టు దుకాణాలు పెట్టి విచ్చలవిడిగా అమ్మకాలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెల్లవారుజామున మద్యం తాగిన వారు దర్గా వద్దకు వచ్చి భక్తులకు అసౌకర్యం కలిగిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కసుమూరులో బెల్టు దుకాణాలు లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసుల త్యాగాలను స్మరించుకుందాం



మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

- ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం వారోత్సవాల్లో భాగంగా నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో వివిధ కాలేజీల విద్యార్థులకు పోలీసుల త్యాగాలపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎందరో ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారన్నారు. సమసమాజం, ప్రజా రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వారి త్యాగాలను అందరూ గుర్తుంచుకోవాలన్నారు. యువత పోలీసు శాఖ వైపు ఆసక్తి చూపాలన్నారు. గంజాయికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ యువత ప్రేమ పేరిట మోసపోవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ నరసింహారెడ్డి, నగర, ఏఆర్, డీటీసీ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, గిరిధర్, డీటీసీ, ఎస్బీ – 2 ఇన్‌స్పెక్టర్‌లు మిద్దె నాగేశ్వరమ్మ, బి.శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్, హెచ్‌జీ ఆర్‌ఐలు రాజారావు, థామస్‌రెడ్డి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారు.. పట్టుకోండి

- విజిలెన్స్ ఎస్పీకి ఫోన్
- తనిఖీల్లో ఉప్పుడు బియ్యం అని తేలిన వైనం

నెల్లూరు(క్రైమ్): రెండు లారీల్లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారంటూ ఓ వ్యక్తి ఫోన్ కాల్‌తో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్రమత్తమయ్యారు. నెల్లూరు జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో అవి ఉప్పుడు బియ్యం అని తేలింది. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు, సూళ్లూరుపేట నుంచి రెండు లారీల్లో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం కావలి వైపు తరలిస్తున్నారని మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రాజేంద్రకుమార్‌కు ఓ వ్యక్తి ఫోన్‌లో సమాచారం అందించారు. ఎస్పీ ఆదేశాలతో అప్రమత్తమైన సిబ్బంది ఎన్టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు నుంచి విజయవాడ వెళ్తున్న రెండు ట్రాన్స్‌పోర్టు లారీల్లో సుమారు 40 బియ్యం బస్తాలను (25 కేజీలు) గుర్తించారు. వాటిని పరిశీలించగా అవి ఉప్పుడు బియ్యం అని తేలింది. అయితే దానికి బిల్లులు లేకపోవడంతో జీఎస్టీ, పెనాల్టీ విధించారు. ఈ తనిఖీల్లో డీసీటీఓ విష్ణురావు, ఏఓ వేణుపాల్, ఎఫ్ఆర్ఓ గోపాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ బాబ్జీ, కానిస్టేబుల్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టాంప్‌ల పంపిణీ

నెల్లూరు సిటీ: జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మంగళవారం నాన్ జ్యుడీషియల్ స్టాంప్స్‌ను పంపిణీ చేశారు. రూ.100, రూ.50 స్టాంప్‌లు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 15 కార్యాలయాలకు అవసరమైన మేర స్టాంప్స్ అందజేశారు. స్టోన్‌హౌస్‌పేటకు రూ.9 వేలు, కందుకూరుకు రూ.5 వేలు, కోవూరుకు రూ.4 వేలు, ముత్తుకూరుకు రూ.4 వేలు, పొదలకూరుకు రూ.4 వేలు, రాపూరుకు రూ.2 వేలు, ఉదయగిరికి రూ.2 వేలు, వింజమూరుకు రూ.3 వేలు, కావలికి రూ.8 వేలు, అల్లూరుకు రూ.2 వేలు, ఆత్మకూరుకు రూ.4 వేలు, బుచ్చిరెడ్డిపాళేనికి రూ.5 వేలు, ఇందుకూరుపేటకు రూ.4 వేలు విలువ చేసే స్టాంప్‌లు పంపిణీ చేశారు. బుజబుజనెల్లూరు కార్యాలయంలో ఇప్పటికే సరిపడా ఉన్నాయి.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు: ట్రాక్టర్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆత్మకూరు మండలం పడకండ్ల గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన నిక్కం కార్తీక్ (30) అనే వ్యక్తి గ్రామానికి చెందిన రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మరో రైతుకు చెందిన పొలంలో దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ టైరు రాయిపైకి ఎక్కింది. దీంతో డ్రైవింగ్ సీటులో ఉన్న కార్తీక్ జారి కింద పడ్డాడు. టైరు అతడిపైకి ఎక్కింది. దీంతో అక్కడికక్కడే అతను మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు పొలం వద్దకు వచ్చి కన్నీరు మున్నీరుగా రోదించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జిలానీ తెలిపారు.

కామాక్షితాయి హుండీ కానుకల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రూ.29,97,7,788ల నగదు వచ్చిందన్నారు. బంగారం 88 గ్రాములు, వెండి 128 గ్రాములు, 11 యూఎస్ డాలర్లను భక్తులు అందించారని వివరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి కోవూరు జనార్దనరెడ్డి, బ్యాంక్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

నెల్లూరు(పొగతోట): ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ షాపుల ద్వారా బియ్యంతోపాటు చక్కెర, మూడు కేజీల జొన్నలు, రూ.67లకు కేజీ కందిపప్పు పంపిణీ చేస్తామని చెప్పారు. నవంబర్ 1వ తేదీ నుంచి ఉచిత సిలిండర్ల పంపిణీ జరుగుతుందన్నారు. ప్రత్యేక కౌంటర్లు పెట్టి పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్ తక్కువ ధరకే అందించేలా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నరసింహారావు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

- జాయింట్ కలెక్టర్ కార్తీక్


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(దర్గామిట్ట): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామసభలను పూర్తి చేయాలన్నారు. రీసర్వేకు సంబంధించి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని, మండల సర్వేయర్లు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. రోజూ రెవెన్యూ డివిజనల్ అధికారులు మండల స్థాయిలో పెండింగ్ అంశాలపై సమీక్ష చేయాలన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. రెవెన్యూ అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా సర్వే అధికారి వై.నాగశేఖర్, ఆత్మకూరు ఆర్డీఓ పావని, నెల్లూరు ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

దీపం.. లక్ష్మీ స్వరూపం

దీపావళికి ప్రమిదలు సిద్ధం

- కార్తీక దీపాలు వెలిగించేందుకు కొనుగోలుదారుల ఆసక్తి
- ఆకట్టుకుంటున్న వివిధ రకాల ప్రమిదలు


ఆత్మకూరులో ప్రమిదల విక్రయం

ఆత్మకూరు: వెలుగుల దీపావళి పండగను ప్రజలు గురువారం జరుపుకోనున్నారు. దీపాలను లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. వాటిని వివిధ రకాల ప్రమిదల్లో ఇళ్ల ముంగిట వెలిగించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పలు రకాల ప్రమిదలు విక్రయానికి సిద్ధంగా ఉండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. దీపావళి మరుసటి రోజు నుంచి పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కానుంది. ఈ నెలరోజులపాటు ఇళ్లల్లో దీపాలు వెలిగించడం పరిపాటి. ఇందుకోసం వివిధ రకాల ప్రమిదలను మహిళలు సిద్ధం చేసుకుంటున్నారు. అనాదిగా మట్టి ప్రమిదల్లో ఆవు నెయ్యి, నువ్వులనూనె పోసి పత్తితో ఒత్తులు చేసి దీపాలు వెలిగిస్తారు.

ఆకట్టుకుంటున్న ప్రమిదలు

గతంలో సాదాగా మట్టితో ప్రమిదలను చేయటం, వాటినే ప్రజలు ఉపయోగించడం జరుగుతుండేది. కాలక్రమేణ వాటితోపాటు టెర్రకోట కళాకారులు ప్రతిభతో తయారు చేసిన మట్టి ప్రమిదలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వివిధ ఆకృతుల్లో వీటిని తయారు చేయడం, దానికి తగ్గట్టుగా పలు ఆకర్షణీయ రంగులను అద్దడంతో వాటిని కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. చిత్తూరు, మదనపల్లి, బెంగళూరు ప్రాంతాల్లో కళాకారులు తయారు చేసిన ఈ దీపాలను దుకాణదారులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వీటిలో నారికేళం, గోపికల చేతిలో దీపాలు తదితరాలు ఆకట్టుకుంటున్నాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తగా నీటితో వెలిగించే దీపాలు రావడంతో వాటిని కొందరు కొనుగోలు చేస్తున్నారు.

ధరలిలా..

దీపావళి మొదలుకుని నెలరోజులపాటు తమ ఇళ్ల ముంగిట దీపాలు వెలిగించేందుకు మహిళలు వారి స్థోమతను బట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్నారు. చిన్నవి ఒక్కొక్కటి రూపాయి మొదలుకాగా, టెర్రకోట దీపాల ప్రమిదలు రూ.2 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. నారికేళం ఆకృతి, గోపికల ఆకృతిలో తయారు చేసిన దీపాలను రూ.50 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు. ఇలాంటి ఆకర్షణీయమైన ప్రమిదల్లో దీపాలు వెలిగించి ఇళ్ల ముందు పెడితే ఎంతో శోభాయమానంగా ఉంటుంది. దీపాన్ని లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. సాయం సంధ్య వేళ ఇళ్ల ముంగిట వెలిగించి లక్ష్మీదేవిని ఆహ్వానించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఏడాది దీపావళి పండగ జరుపుకొనేందుకు ఉత్సాహంగా ప్రమిదలతోపాటు టపాసులు కొనుగోలు చేస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే టపాసుల ధర 18 నుంచి 20 శాతం పెరిగాయని విక్రయదారులు చెబుతున్నారు. ఏది ఏమైనా దీపావళి పండగను ఉత్సాహంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.35
సన్నవి	రూ.20
వండ్లు	రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు




బ్రాయిలర్ (లైవ్)	134
లేయర్ (లైవ్)	110
బ్రాయిలర్ చికెన్	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	266
లేయర్ చికెన్	187

దీపావళి శోభ

జిల్లా వ్యాప్తంగా దీపావళి పండగ సందడి నెలకొంది. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అనేక డిజైన్లలో ప్రమిదలను వ్యాపారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. నెల్లూరులో అనేక కచోట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు




కండలేరులో 43.086 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 43.086 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,700 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 1,400, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాపూరులో రక్తదాన శిబిరం

రాపూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్సై వెంకటరాజేష్ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో ఎంతో సేవ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వరావు, వైద్యులు రేష్మ, హరీష్, సరస్వతి, రక్తదాతలు పాల్గొన్నారు.